ప్రజాశక్తి
శనివారం 23 డిసెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని దిగుడు పుట్టు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు 25 మందికి బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలి దుస్తులను పంపిణీ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సలీం విద్యార్థులకు క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు యు.మహేష్, కంఠం నాయుడు, కోటి, ఈశ్వరరావు, రాంబాబు, తిరుపతి రావు, బొంజు బాబు, రామన్నపడాల్ పాల్గొన్నారు.

పిల్లలతో నాయకులు

రాస్తారోకోలు, మోకాళ్లపై నిరసనలు

-జిల్లాలో కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

అరకులోయలో మానవహారం చేపడుతున్న అంగన్‌వాడీలు

డుంబ్రిగుడలో మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు అల్లూరి జిల్లాలో రోజురోజుకు సమ్మెను ఉధృతం చేస్తున్నారు. పలు చోట్ల అంగన్‌వాడీలు రాస్తారోకోలు, మోకాళ్లపై నిరసనను శుక్రవారం చేపట్టారు. మరికొన్ని చోట్ల ఉరి తాళ్లతో ఆందోళన చేపట్టారు.

ఎటపాక : అంగన్వాడీ వర్కర్ల పట్ల ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయ్‌ప్రతాప్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఎటపాకలో రాస్తారోకో చేశారు. ప్రభుత్వం ఇచ్చే ఫోన్లు, చీరలు అంగన్వాడీలకు ఇచ్చే వేతనాల కిందకు వస్తాయా? అని ప్రశ్నించారు. తమను అవమానించిన విజయ్ ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుంజా విజయకుమారి, రాజ్య లక్ష్మి, సుజాత, రమ్య, వెంకట రమణ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా రహదారిపై అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక సంఘ గీతాలకు ఆలపిస్తూ అంగన్వాడీలు లయబద్ధంగా నృత్యాలు చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు అంగన్వాడీల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు టి శ్రీను, యూనియన్ నాయకులు కె.వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, ఎల్ సత్యవతి నూక రత్నం కె లక్ష్మి, చిన్నమ్మలు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాజ ఒమ్మంగిలో కోలాటం

మారేడుమిల్లి : స్థానిక మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ కూడలిలో అంగన్వాడీలు రాస్తారోకో చేశారు. కార్మిక సంఘ గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు ఎన్ రత్నకుమారి, డి ప్రసూన, కె.భవాని, పి హైమావతి, కే నాగమణి, ఎం సీతమ్మ, సిహెచ్ రుక్మిణమ్మ, వి సోమాలమ్మ ,పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్వాడీలు 11వ రోజు సమ్మె సందర్భంగా చింతూరు సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లపు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులు 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దారుణమన్నారు. 25వ తేదీ లోగా సమస్యలను పరిష్కరించకుంటే 26 నుండి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేక రాజకుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, అంగన్వాడీలు జయ, నూకరత్నం, కామేశ్వరి, పార్వతి, దుర్గా, సత్యవతి, విజయ కుమారి పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద 11వ రోజు దీక్షలను సిఐటియు నాయకులు నాగమణి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం రేఖపల్లి జంక్షన్ వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూణెం సత్యనారాయణ, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొయ్యూరు : అంగన్వాడీలు 11వ రోజు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గుడ్లపల్లి సెంటర్లో రాస్తారోకో చేపట్టి, రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు వచ్చి వారిని అక్కడ నుండి పంపించేశారు. దీంతో సిడిపిఓ కార్యాలయం ఎదుర ఆందోళన చేపట్టారు. ఎర్రజెండాలు చేతపట్టి ఆట పాటలతో నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, సిఐటియు జిల్లా నాయకులు వై.అప్పలనాయుడు అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో శుక్రవారం అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి గడూతురి సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఎల్.సత్యవతి, ఎస్.అప్పల నరస, చిరంజీవి, భోడేశ్వరి, విజయ్, భవాని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరి తాళ్లతో నిరసన

కూనవరం : అంగన్వాడీలు 11వ రోజు సమ్మె సందర్భంగా శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో చేసి, మెడకు ఉరి తాళ్లు వేసి నిరసనను తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొమరం పెంటయ్య, సీపీఎం. నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సిపిఎం సంఘీభావం

రంపచోడవరం : మండల కేంద్రంలో అంగన్వాడీల పోరాట శిబిరాన్ని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహారిస్తుందని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారించకుండా నిర్లక్ష్యం వ్యహరిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే 26వ తేదీ నుంచి వారి పోరాటాల్లో వామపక్ష పార్టీలు ప్రత్యక్షంగా పాల్గొంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, యూనియన్ నాయకులు కె.రామలక్ష్మి, సింగారమ్మ, మంగయమ్మ, సత్యవేణి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద మోకాళ్ళతో నిరసన చేపట్టి అనంతరం మూడు రోడ్ల జంక్షన్ నుంచి తహాసిల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే కొండమ్మ మాట్లాడుతూ, సమస్యలపై 11 రోజుల నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కొంచెం కార్యదర్శి కే.సత్యవతి, నాయకులు జి పవిత్ర, అంగన్వాడి కార్మికులు, హెల్పర్లు పాల్గొన్నారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న అప్పలనర్స

పెదబయలు:మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్ల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు టి.రాజమ్మ మాట్లాడుతూ, 25వ తేదీ నుండి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు టి.రాజమ్మ, శాంతి, మంగమ్మ, వరహాలమ్మ, పద్మ, కొండమ్మ, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో అంగన్వాడిలు నిర్వహిస్తున్న సమ్మె 11వ రోజుకి చేరింది. సమ్మెకి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య, అధ్యక్షుడు ఎంఎం శ్రీను, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాద్ దీక్ష శిబిరంలో సంఘీభావం తెలిపారు. దీక్ష ప్రాంగణం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు అంగన్వాడిలతో భిక్షాటన చేసి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య మాట్లాడుతూ, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమానిలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు, అంగన్వాడి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఈశ్వరి, కాంతమ్మ కళ, సుజాత మౌళమ్మ, చిలకమ్మ, కుమారి, సురమ్మ సత్యవతి పాల్గొన్నారు.

అనంతగిరి:అంగన్వాడీల సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దీసరి గంగరాజు, అంగన్వాడి మండల యూనియన్ నాయకురాలు కళావతి, మంజుల పార్వతి, సరస్వతి,భాగ్య, కుమారి, చిట్టమ్మ, టీచర్లు,హెల్పర్లు పాల్గొన్నారు

హుకుంపేట :స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు సిపిఎం మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, అక్క చెల్లెల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నానని చెబుతున్న సీఎం జగన్మోహన్ రెడ్డి ఆచరణలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నాలుగు రోడ్డు కూడలి వద్ద భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి నాగమ్మ, వెంకటలక్ష్మి, కె.లక్ష్మి, నిర్మల, పూజరి, గౌరమ్మ పాల్గొన్నారు.

పెదబయలులో..

కూనవరంలో ఉరితాళ్లతో నిరసన

గణిత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం పి.మాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల హెచ్ఎం, గణిత ఉపాధ్యాయుడు దేవేశ్వరరావు, మరో గణిత ఉపాధ్యాయుని భానుప్రియను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గణితానికి సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు, నృత్య ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు.

పెదబయలు : స్థానిక బాలుర, గురుకుల పాఠశాలలో రామానుజం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిన్సిపాల్స్ శంకర్‌రావు, ఈశ్వరమ్మలు రామానుజం చిత్ర పటానికి నివాళి అర్పించారు.

గణితంపై వివిధ పోటీలు

విఆర్.పురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు గణితంపై అవగాహన కొరకు శుక్రవారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గణితంపై వ్యాసరచన, రంగోలి, టిఎల్ఎం మెటీరియల్ వర్కింగ్ మోడల్స్, క్విజ్ పోటీ, డ్రాయింగ్ పోటీ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం బాబురావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు కారం రాము, డివి.సత్యనారాయణను విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, సీత, భారతి పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అంతాడ పంచాయితీ పరిధి కొత్తపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గంగాధర్, స్థానిక సర్పంచ్ సుర్ల చంద్రరావు చేతుల మీదుగా 50 మంది వృద్ధులకు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు పాంగి సత్యవతి, పాంగి పోతురాజు వైసిపి నాయకులు సరమండ అగ్గి రాముడు, వాలంటీరు పాంగి కన్నబాబు, అల్లంపల్లి కనకమహాలక్ష్మి, కొర్రు వీర్రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

తుపాను బాధితులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మిచౌంగ్ తుఫాన్ దాటికి పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతూ మండల తహశీల్దారు అనసూయకు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ పంటు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దెబ్బతిన్న పంటలకు కొంతమేరకే సర్వే చేశారని, పూర్తి స్థాయిలో సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోలవరం పరిహారం తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇవ్వమని ప్రభుత్వం చెప్పడం తగదన్నారు. భూ సేకరణ భూములకు నష్టపరిహారం ఇవ్వకూడదని ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఏమైనా ఉంటే తమకు చూపించాలని డిమాండ్ చేశారు. పోలవరం పరిహారం ఇప్పించి ఈ ప్రాంత వాసులను తరలించాలన్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టిన రైతులు భారీగా నష్టపోయారని, వారిని ఆదుకోవడం లో ప్రభుత్వం ఎందుకు మీన మేషాలు లెక్కిస్తుందని ప్రశ్నించారు. తక్షణమే ప్రతి రైతుకీ న్యాయం చేయాలని, లేకుంటే రైతులతో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, ఆవుల మురళి, ఉపేంద్ర, కర్నాటి శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

మావోయిస్టుల బంద్‌తో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసు బలగాలతో సీలేరు పరిసర ప్రాంతాలతో పాటు ఏఓబి సరిహద్దుల్లో ముమ్మర తనిఖీ నిర్వహించారు. సీలేరు ప్రధాన కూడళ్ళలో స్థానిక ఎస్సై రామకృష్ణ, సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులతో వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా భద్రతా చర్యలు చేపట్టారు. ఏఓబి నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు. అనుమానిత వ్యక్తులను చోదా చేస్తూ వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో అదనపు బలగాలతో విస్తృత కూంబింగ్ నిర్వహించారు. భారత్ బందు నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా విశాఖ వయా సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీసు బస్సులను ఆర్టీసీ అధికారులు శుక్రవారం రద్దు చేశారు. దీంతో ప్రయాణికులుకు నాన అవస్థలు గురయ్యారు.

వాహన తనిఖీలు చేపడుతున్న స్థానిక ఎస్సై రామకృష్ణ, పోలీసు సిబ్బంది

వైసిపికి ఓటమి భయం పట్టుకుంది

ప్రజాశక్తి-రంపచోడవరం

వై నాట్ 175 అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి, టిడిపి నవశకం బహిరంగ సభ విజయవంతం కావడంతో ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా అడ్డుకున్నా రాష్ట్రంలో ప్రజలందరూ ఏది దొరికితే అది ఎక్కి రాష్ట్రం నలుమూలల నుంచి టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు లక్షలాదిగా తరలివచ్చారని తెలిపారు. ముగింపు సభలో లోకేష్ ప్రసంగించిన తీరు చూస్తుంటే ఆయన ఒక పరిణితి చెందిన రాజకీయ నాయకుడిగా తయారయ్యాడని చెప్పారు. నవశకం ముగింపు సభకు వచ్చిన జనాన్ని చూసి ముఖ్యమంత్రికి, మంత్రులకు మైండ్ బ్లాక్ అయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా 165 సీట్లు సాధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, నాయకులు సిద్ధ వెంకన్న దొర, కుంజం బాపన్న దొర, బొడ్డేటి వీరబాబు, మడకం పండుదొర, ధారా వెంకన్న, కోండ్రు చక్రపాణి పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

సబ్ కలెక్టర్‌గా ప్రశాంత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నూతన సబ్ కలెక్టర్‌గా యస్.ప్రశాంత్ కుమార్ శుక్రవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో కొంతకాలం అసిస్టెంట్ కలెక్టర్గా విధులు నిర్వహించడం జరిగిందని, అక్కడ నుండి రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం చెప్పారు. ఏజెన్సీలోని రెవెన్యూ సేవలు సకాలంలో ప్రజలకు అందించే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రంపచోడవరం డివిజన్లోని ఏడు మండలాలలో ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. నూతన సబ్ కలెక్టర్‌ను రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు యస్‌కె.జిలాని, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మడకం సావిత్రి, తాసిల్దార్లు యం.శ్రీనివాసరావు. సిహెచ్. శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ. డిప్యూటీ తాసిల్దారులు బి. రాజు, శ్రీధర్, కె.సుధాకర్ బాబు, శివ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, సర్వే శాఖ అధికారులు సిబ్బంది సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రి దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి-కొయ్యూరు : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం చింతపల్లి విచ్చేసిన సందర్భంగా, పాడేరు శాసనసభ్యులు ఆధ్వర్యాన ఆయన్ను కలిసి మండల సమస్యలను తెలియజేసినట్లు ఎంపిపి బడుగు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ, ఐటిఐ, జూనియర్ కళాశాల, రేవళ్ళులో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని, కాకరపాడు హైవే నుండి మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని, ఈ మధ్య రెండు వంతెలను నిర్మించాలని, బుదరాళ్ల- పెద్దవలస ఘాట్ రోడ్డు విస్తరణ చేయాలని, కించవాణిపాలెం రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని, మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు

ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి బడుగు రమేష్

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

- మద్దతు ప్రకటించిన యుటిఎఫ్

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత

ప్రజాశక్తి-పాడేరు : పాడేరులో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె మూడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఐటిడిఎ వద్ద చేపట్టిన నిరసన దీక్షను శుక్రవారం కొనసాగించారు. ఈ సమ్మెకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా శాఖ సంపూర్ణ మద్దతును తెలిపింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గతంలో పాదయాత్ర సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగానూ, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగానూ మారుస్తామని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నీటి మీద రాతలుగా మార్చేశారని విమర్శించారు. నాడు మాట తప్పను మడమ తిప్పనని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పడం సరి కాదన్నారు. అరకొర జీతంతో వెట్టిచాకిరీ చేయించడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ఎస్ఎస్ఏ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ, జీతంతో పాటు డిఏ, హెచ్ఆర్ఏ అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. తక్షణమే బకాయిపడ్డ జీతం ఎస్.ఎస్.ఎ ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కారం చేయని పక్షంలో ఉపాధ్యాయ సంఘాలు కూడా ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా సమ్మెలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎం.ధర్మారావు, సిహెచ్. నాగేశ్వరరావు, జె.సత్యనారాయణ, ఎన్. గోపి, సురేష్ లు మద్దతుగా పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

రెజ్లింగ్ పోటీలకు వెళ్తున్న నిర్మలతో కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి-అరకులోయ :స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని పాంగి నిర్మల జాతీయస్థాయి అండర్ 20 రెజ్లింగ్ పోటీలకు ఎంపిక అయ్యింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నవాబ్ గంజ్ లో ఈనెల 28 నుండి 30 వరకు జరగనున్న పోటీలకు అరకులోయ డిగ్రీ కళాశాల కళాశాల నుండి పాంగి నిర్మల ఎంపికైంది. దీంతో ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ అభినందనలు తెలియజేశారు. జాతీయస్థాయిలో గెలుపొంది కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు సూచించారు. పట్టాసి ఫౌండేషన్ తరపున రెజ్లింగ్ పోటీలకు పాల్గొనే నిర్మలకు కొంత ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పుష్పరాజు, స్పోర్ట్స్ ఇంచార్జ్ నాగబాబు, అధ్యాపకులు కొండబాబు, గణేష్, లచ్చన్న, డాక్టర్ మురళి పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో రికార్డుల తనిఖీ



తనిఖీ చేస్తున్న కోఆర్డినేటర్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ కె భాస్కర్‌రావు శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సలహా సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ సింహాచలం, సమగ్ర శిక్ష ఐటి మహేష్, మండల ఐ ఈఆర్‌పిలు ఏ కిరణ్ కుమార్, పి.కళ్యాణి, సిబ్బంది పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని కందులూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తాగునీరు, రహదారుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో శాంతిరాజ్ అధ్యక్షతన సిపిఎం శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ కుందులూరు పంచాయితీలోని అన్ని గ్రామాల్లో తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఉందని, సమస్యను పరిష్కరించడంలో స్థానిక వైసీపీ సర్పంచ్ విఫలమయ్యారని విమర్శించారు. తెల్లంవారిగూడెం రోడ్డు తవ్వి వదిలేశారని, దీంతో ఈ మార్గంలో అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేకుండా ఉందని పేర్కొన్నారు. వెంటనే అధికారులను ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు పంకు సత్తిబాబు, మాజీ సర్పంచు తెల్లం కన్నమ్మ, శాఖకార్యదర్శి తెల్లం కన్నారావు, సభ్యులు నాంచారమ్మ, రాజయ్య, బుల్లెమ్మ పాల్గొన్నారు.

వారపు సంతలో షెడ్డుకు నిప్పు

ప్రజాశక్తి-కొయ్యూరు :కొయ్యూరు మండలంలోని రాజేంద్రపాలెంలో వారపు సంత ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసే షెడ్డుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి ఒక షెడ్డు పూర్తిగా దగ్ధం కాగా, మరికొన్ని పాక్షికంగా కాలిపోయాయి. మంటలు గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేశారు.

ఆర్‌బికెను సందర్శించిన వియత్నాం బృందం

చిరుధాన్యాల సాగును పరిశీలిస్తున్న వియత్నాం బృందం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వేములవలస రైతుభరోసా కేంద్రాన్ని వియత్నాం ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయం విధానంలో చిరుధాన్యాల సాగు, పొలంబడి నమూనాలను ప్రదర్శించగా వాటిని తిలకించారు. ఈ సందర్భంగా వియత్నాం ప్రతినిధుల బృందానికి వ్యవసాయశాఖ అధికారులు దీనిపై వివరించారు. అమరావతి నుంచి వచ్చిన వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్, ఉప సంచాలకులు వేంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు, వెటర్నరీ డిడి డాక్టర్ కరుణాకర్, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.మోహన్‌రావు, వ్యవసాయశాఖ ఎడి డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ సిహెచ్ సుబ్రమణ్యం, మండల వ్యవసాయ అధికారులు. సిహెచ్ సంధ్య రత్నప్రభ, బి.శివకోమలి, ఎవిఎస్.చలం, వేములవలస అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ అహ్మద్‌గౌస్, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు కోరాడ రాంబాబు పాల్గొన్నారు

సిఎం పర్యటనతో ఆదివాసీలకు ఒరిగింది సున్నా..!

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన .. రాస్తారోకో

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: చింతపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనతో ఆదివాసులకు ఒరిగింది ఏమీ లేదని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ విమర్శించారు. శుక్రవారం అరకువేలి మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ,రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదివాసుల సమస్యల పరిష్కారం దిశగా ప్రకటన చేస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశామని, తీవ్ర నిరాశ పర్చారన్నారు. ఆదివాసుల సమస్యలపై కనీసం మాట్లాడకపోవడం సరికాదన్నారు.జిఓ 3 రద్దు అయ్యి మూడున్నర ఏళ్లు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు. జిఓ 3 అమలులో ఉన్నప్పుడు గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు పొందేవారన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో గురుకులం, ఏకలవ్య పాఠశాల, కళాశాలల్లో, శిశు సంక్షేమ శాఖల్లో ఆదివాసిలకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో గిరిజన ఆశ్రమ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1500 ఉపాధ్యాయ పోస్టులు స్పెషల్ డిఎస్సి ద్వారా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరుతో పాడేరు ఐటీడీఏ పరిధిలో 107 పాఠశాలలు మూసివేసారన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో ఉన్న కాఫీ రైతులకు 60 కోట్ల బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. అంత్యోదయ కార్డులు, సీసీడీపీ నిధులు, గృహ నిర్మాణాలపై ం కనీసం ప్రస్తావనకు రాకపోవడం ఆదివాసులకు నమ్మించి మోసం చేసి ద్రోహం చేయడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, మండల నాయకులు కె.జగన్నాథం, కె బుజ్జిబాబు, సత్యారావు, అప్పలస్వామి, చిట్టిబాబు, భవాని, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న ఆదవాసీ గిరిజన సంఘం నాయకులు

గిరిజనులను నిరాశపరిచింది

దుంబ్రిగుడ:చింతపల్లిలో ముఖ్యమంత్రి జగన్ పర్యటన గిరిజనులను నిరాశపరిచిందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, తమ కార్యకర్తలను అక్రమ గృహ నిర్బంధం, అరెస్టులు చేసి గిరిజనుల గొంతు నొక్కే ప్రయత్నం చేసారనీ మండిపడ్డారు. హైడ్రోపవర్ ప్రోజెక్టు అనుమతులు రద్దు చేయాలన్నారు. పివిటిజి అంత్యోదయకార్డుల మంజూరు, బాషా వాలంటీర్లకు వేతనాలు తదితర డిమాండ్లు సీఎం ముందు ఉంచినా కనీసం వాటిపై మాట్లాడక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా గిరిజన ఉద్యోగ, మేధావులు, యువతి యువకులు, నిరుద్యోగులు వివిధ ప్రజా సంఘాల నేతలు మేల్కొని గిరిజన జాతి మనుగడను కాపాడడానికి మరో ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు.23న శనివారం మండల కేంద్రంలో నిర్వహించే నిరసనకు వేలాదిమంది తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టి.పాపారావు, బి శంఖర్, మధు అనిల్ పాల్గొన్నారు.

గిరిజన సంపద బైజూస్‌కు కట్టబెట్టడానికే...

ముఖ్యమంత్రి జగన్ పర్యటనపై సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మండిపాటు

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: పలు గిరిజన సమస్యలపై ముఖ్యమంత్రి స్పందన కోసం ఎదురుచూసిన ఆదివాసి ప్రజలకు సీఎం పర్యటన నిరాశే మిగిల్చిందని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనరస తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అప్పలనర్స మాట్లాడుతూ, నాలుగున్నర సంవత్సరం తర్వాత ఏజెన్సీ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిపై ఆదివాసులు అనేక ఆశలు పెట్టుకున్నారని,వైసిపి నాయకులు చేసిన ప్రచారం ఆచరణలో కానరాలేదన్నారు.ఆదివాసులకు 100శాతం ఉద్యోగ రిజర్వేషన్, హైడ్రో ప్రాజెక్ట్ రద్దు, ఆదివాసి మాతభాషా విద్యా వాలంటరీ జీతం పెంపు, పివి టిజి గిరిజనులకు అంత్యోదయ రేషన్ కార్డులు, ఐదు లక్షలతో ఇల్లు మంజూరు చేయాలని, కాఫీ రైతులకు 62 కోట్లు విడుదల చేయాలనితదితర అనేక సమస్యలసౌ ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా ముఖ్యమంత్రి పర్యటనలో కనీసం ప్రస్తావించక పోవడం గిరిజనులపై వైసీపీకి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని తెలిపారు.. ఆదివాసి సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లే ఆదివాసి రాజకీయ నాయకులను నిర్బంధించడం జగన్ నియంతృత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఆదివాసి ఎమ్మెల్యేలు, ఎంపీ సిఎంకు తొత్తులుగా వ్యవహరించారని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏజెంట్లుగా ఉన్నారని విమర్శించారు. అందుకే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు కోసం కనీసం ముఖ్యమంత్రి దగ్గర ప్రస్తావించ లేదన్నారు. బాక్సైడ్‌పై జీవో 97 రద్దు చేశామని గతంలో ప్రకటించిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదివాసులకు ఎటువంటి నష్టం లేకుండా బాక్సైట్ ఎలా తీయాలనే దానిపై జీవో 89 ని జారీ చేసిందన్నారు.అంగన్వాడీల, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తులు ధర్నాలు ర్యాలీలు సమ్మెలు చేస్తున్నా కనీసం నోరు మెదపలేదన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎల్.సుందర్రావు, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో వినియోగ దారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కులు, చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు బి చిట్టిబాబు మాట్లాడుతూ 24 న జరగబోయే జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవంను జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల జీతాలెందుకు పెంచరు ?

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అంగన్వాడీల జీతాలు పెంచం అని చేసిన ప్రకటనను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఖండించారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పెంచం అని చెప్పిన మంత్రి ఉషశ్రీ చరణ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి జీతాలు పెంచాలన్నారు. లేనిపక్షంలో కార్మిక సంఘాలన్నీ కలిసి ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. 11 రోజులు నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ పెంచే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచలేదని, మరోవైపు ధరలు మాత్రం రెట్టింపు అయ్యాయని అన్నారు. సెంటర్ల అద్దెలు కూడా పెరిగాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు భత్యం ప్రకారం 469 పాయింట్లు పెరిగాయన్నారు. దీనికి రూ.3,630 నెలకు అదనంగా ఇవ్వాలన్నారు. అంగన్వాడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వారికి జీతాలు పెంచేది లేదని రాష్ట్ర ప్రభుత్వం నాటకాలు ఆడటం సరికాదని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం గత నాలుగేళ్ల బడ్జెట్‌లో అంగన్వాడీలకు నిధులు పెంచలేదని తెలిపారు. ట్రేడ్ యూనియన్లన్నీ అంగన్వాడీలకు పూర్తి మద్దతు తెలుపుతున్నాయని స్పష్టం చేశారు. వచ్చే వారంలో మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి పాల్గొన్నారు.

తెరపైకి మలసాల భరత్ కుమార్

అమర్‌పై పెరుగుతున్న అసంతృప్తి
సిట్టింగ్ స్థానం దక్కించుకునే యోచనలో సిఎం - ప్రారంభమైన ఎన్నికల కసరత్తు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మళ్లీ అనకాపల్లి నుంచి పోటీచేసే అవకాశముందా ? అంటే దాదాపు లేదనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ ప్రజలకే కాదు, పార్టీ క్యాడర్‌కూ దూరంగా వుంటున్నారన్న అసంతృప్తి ఆ పార్టీలోనే తీవ్రంగావుంది. ఎమ్మెల్యేగా వున్న కాలంలోనూ, మంత్రి పదవి వచ్చిన తరువాత ఆయన వ్యవహారశైలిలో మార్పు లేకపోవడంతో పార్టీలో అనేక మంది నాయకులు కాస్త దూరం పాటిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సన్నిహితునిగా మంత్రి వున్నప్పటికీ గెలవలేనిచోట సిట్టింగ్‌లకు టిక్కెట్ ఇవ్వబోనని సిఎం చెబుతూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టిక్కెట్ కొత్తవారికి ఇవ్వనున్నట్లు సిఎం సూచనప్రాయంగా అమర్‌కు చెప్పినట్లు తెలిసింది. అధిష్టానం నుంచి ఈ తరహా సంకేతాలు రావడంతో యలమంచిలి, చోడవరం, గాజువాక నియోజకవర్గాల్లోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలో అమర్ వున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మార్పుతో గాజువాక నుంచి పోటీచేసే అవకాశం లేదు. యలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో తన సామాజిక తరగతులను కూడగట్టి పోటీ చేయాలని ఎంత ప్రయత్నించినా ఆ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లను కాదని అమర్‌కు టిక్కెట్ ఇవ్వరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజును కాదని టిక్కెట్ సంపాదించడం అమర్‌కు అంత సులువుకాదు. రాబోయే ఎన్నికల్లో పోటీకి సీటు పొందలేని స్థితి అమర్‌కు ఎదురుకానుంది. టిడిపికి ధీటైన వ్యక్తిని బరిలో నిలబెట్టాలన్న ఆలోచనలో అమర్‌కు బదులు కొత్త వ్యక్తిని తెరమీదకు తీసుకురానున్నట్లు తెలిసింది. అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలానికి చెందిన మాజీ ఎంపిపి మలసాల కాసులమ్మ (ధనమ్మ), విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు తనయుడు భరత్ కుమార్‌కు వచ్చే ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. జగన్మోహన్‌రెడ్డిని మలసాల కుటుంబీకులు కలిసినప్పుడు భరత్‌కుమార్‌కు అనకాపల్లి టిక్కెట్ ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. మంత్రి అమర్ సామాజిక తరగతికి చెందిన భరత్ కుమార్‌కు టిక్కెట్ ఇస్తే ఎన్నికల ఫలితాలు సానుకూలంగా వుంటాయన్న ఆశతో సిఎం వున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సిఎం జగన్‌తో మలసాల కుటుంబీకులు (ఫైల్‌ఫొటో)

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మిందికి చెందిన అమర్ గత ఎన్నికల్లో అనకాపల్లి నుంచి గెలిచారు. నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో వుండకపోవడం, సొంతిళ్లు మింది నుంచి ఆయన కార్యకలాపాలన్నీ కొనసాగించడం, కార్యకర్తలు వెళ్లినా పట్టించుకోకపోవడం వంటి పలు కారణాలు మంత్రి పట్ల పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి పెరగడానికి దారితీశాయి. సీనియర్ నాయకులతో మంత్రికి సఖ్యతలేదు. వచ్చే ఎన్నికల నాటికి క్యాడర్‌లో ఈ అసంతృప్తి తగ్గే అవకాశం లేకపోవడంతో కొత్త వారికి టిక్కెట్ ఇవ్వాలన్న యోచనలో సిఎం వున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో భరత్ కుమార్ పోటీ చేయడానికి ఆసక్తి చూపడంతో సిఎం ఆయనకు టిక్కెట్ ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి ముందు మంత్రిని ఒప్పించి నియోజకవర్గ నాయకత్వంతో మాట్లాడిన తరువాత ఇన్‌ఛార్జ్‌గా భరత్ కుమార్‌ను నియమించనున్నట్లు తెలుస్తోంది.

మాచ్‌ఖండ్ కార్మికుల సమ్మె

నిరసన చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: వేతనాల కోతను వ్యతిరేకిస్తూ ఏఓబి సరిహద్దు ప్రాంతమైన మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులు శుక్రవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం అధ్యక్షుడు బిఎస్ పండ మాట్లాడుతూ ఆంధ్ర ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మచ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని, ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. అరరొర వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీలేరు కేంద్రంగా నాలుగు ప్రాజెక్టులు ఉండగా మూడు ప్రాజెక్టులలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్‌ఉద్యోగులకు జీతాలు పెంచి మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పెంపుదల చేయలేదని ఆవేదన చెందారు. పెరిగిన జీతాలు ఎందుకు అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ పట్టి పాంగి, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ బాషా, కార్మికులు వి.శంకర్రావు, మహేంద్ర, ప్రసాద్, దాస్, కొను మిస్రో, డానియల్ పాల్గొన్నారు.

పంట నష్టాలకు పరిహారమేదీ?

అరకు మండల సర్వసభ సమావేశంలో నిలదీసిన సభ్యులు

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల సమావేశం మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు నివేదికను ప్రవేశపెట్టారు. తుపాను నష్టపరిహారం ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని అధికారులపై సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో అధికారులు పంట నష్టం పై సర్వే చేసి అంచనా వేయడం లేదని మండిపడ్డారు. మండలంలోని 14 పంచాయతీ పరిధిలో పదోవ డిఎల్ సీలో 640 పోడు పట్టాలు పెండింగ్లో ఉన్నాయని దీన్ని ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని దీనిపై అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడటం లేదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి మంచినీరు అందించాలని ఉద్దేశంతో ప్రారంభించిన జీవన్ మిషన్ పథకం ఎందుకు వేగవంతం చేయడం లేదన్నారు.ప్రతి సర్వసభ్య సమావేశంలో ఏదో ఒక సాకు చెప్పి కాలం గడుపుతున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు.అనంతరం ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ. సమావేశంలో తెలిపితే ప్రతి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేష్, ఎంపీపీ కిల్లో రామన్న, పంచాయతీరాజ్ డిఇ రామమ్ పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణం చేపట్టాలి : సిపిఎం ఆందోళన

జగనన్న గృహ నిర్మాణానికి ఐదు లక్షలు పెంచి నిర్మాణం వేగవంతం చేయాలని, తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరంతో సంబంధం లేకుండా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల సర్వసభ సమావేశం బయట సిపిఎం నాయకులు ఆందోళనకు దిగారు. అధికారులు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. సిపిఎం నాయకులు అడిగిన సమస్యలపై ఎంపీడీవో వ్యవసాయ శాఖ అధికారి సమాధానం చెప్పలేక లోపలికి వెళ్లిపోయారు.దీంతో ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ మాట్లాడుతు తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ. తుఫాన్ కారణంగా వరి రాజ్మా చోల్లు, పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని దీంతో రైతులు నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, జన సంఘం నాయకులు జగనాదం,కె బుజ్జి బాబు, రాజు, అప్పలస్వామి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో ఎక్మో చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వెంటిలేటర్ సపోర్టు, అత్యధిక ఆక్సిజన్ వినియోగం, అధిక రక్తపోటు, హెచ్ త్రీ, ఎన్ టు సంబంధిత ఊపిరితిత్తుల సమస్యతో అత్యంత విషమంగా ఉన్న 54 సంవత్సరాల వ్యక్తికి నగరంలో ఉన్న కేర్ హాస్పిటల్స్‌లో ఎక్మో చికిత్సను విజయవంతంగా అందించారు. క్రిటికేర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ మోనంగి, డాక్టర్ టిఎల్.రాణి నేతృత్వంలో క్రిటికల్ కేర్ వైద్యులు రాము సభ్యులుగా ఉన్న ఈ వైద్య బృందం డాక్టర్ శ్రీనివాస్ మోనంగి ఆధ్వర్యంలో అత్యంత సంక్లిష్టమైన చికిత్సను అందించినట్లు హాస్పిటల్ పరిపాలనాధికారి శ్రీనివాస్ వద్దిపర్తి తెలిపారు. శుక్రవారం కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్మో సేవలు చాలా అరుదుగా అందుబాటులో ఉన్నాయని, పేషంట్ తమ వద్దకు వచ్చేసరికే అత్యంత విషమంగా ఉన్నారని, ఎక్మో గురించి సుదీర్ఘంగా వివరించి, చికిత్స వల్ల ఉన్న ఉపయోగాలను కుటుంబ సభ్యులకు తెలియజేశామని తెలిపారు. ఎక్మోపై 14 రోజుల సుదీర్ఘ చికిత్స తరువాత రోగి కోలుకున్నారని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాస్ మోనంగి మాట్లాడుతూ చాలా సందర్భాలలో అవగాహన లేకపోవడం ఒక స్థితి అయితే, సుశిక్షితులైన వైద్య బృందం అందుబాటులో లేకపోవడం మరొక పరిస్థితని వివరించారు.పేషెంట్ మాట్లాడుతూ తనకు పునర్జన్మనిచ్చిన వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌కు, ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ టిఎల్.రాణి, డాక్టర్ ఎం.రాము, డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.

వాసుపల్లికి సీటు ఇస్తే మత్స్యకారులు ఓడిస్తారు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గం వైసిపి టిక్కెట్టును ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కి ఇస్తే.. మత్స్యకారులు అతనికి పోటీగా అభ్యర్థిని నిలిపి ఓట్లు చీల్చి అయన్ని గద్దె దించుతారని నియోజవర్గానికి చెందిన మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వాడమదులు పెంటయ్య మాస్టారు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అయ్యప్పరాజు, తీర ప్రాంత వాడబలిజ సంఘం కార్యదర్శి కండిపల్లి రామకష్ణ, మత్స్యకార నాయకుడు తెడ్డు శంకర్ అన్నారు. శుక్రవారం పాత నగరం చిలకపేట జంక్షన్‌లో ఉన్న 39వ వార్డు గంగపుత్ర మత్స్యకార వాడ బలిజ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రవర్తనపై కొన్ని రోజులుగా అధికార వైసిపికి చెందిన కార్పొరేటర్లు అసహనం వ్యక్తపరుస్తూ పార్టీలు మారుతున్నారని తెలిపారు. గణేష్ కుమార్ మత్స్యకార సామాజిక తరగతికి చెందిన నాయకుడు అయినప్పటికీ మత్స్యకారుల కోసం ఏనాడూ సహాయ సహకారాలు అందించలేదన్నారు. గణేష్ కుమార్‌కు బదులు మత్స్యకార నాయకుడు, యువకుడు, విద్యావేత్త వాసుపల్లి జానకిరామ్‌కు వైసిపి టికెట్ కేటాయిస్తే మత్స్యకారులంతా మద్దతు తెలిపి గెలిపించుకుంటామని వారన్నారు.

995వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 995వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపిఎస్ నాయకులు ఎం.సుబ్బన్న, వైఎస్ఆర్‌టియు నాయకులు వై.మస్తానప్ప, కూరపాటి అప్పారావు, ఎన్నేటి రమణ, పిట్టా రెడ్డి పాల్గొన్నారు.